
సాక్షి
అనంతపురం
ఆదివారం। 29। జనవరి। 2023



టన్ను చీనీ రూ.30 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.14

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.14, కనిష్టం రూ.5, సరాసరి రూ.9 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.9°/09.6°

జిల్లా అంతటా శనివారం చలి తీవ్రత కొద్దిగా పెరిగింది. గాలివేగం కూడా స్వల్పంగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి.

న్యూస్‌రీల్

మళ్లీ పెరిగిన చలి



అనంతపురం అగ్రికల్చర్: చలితీవ్రత మళ్లీ పెరిగింది. వారం రోజులుగా పెరుగుతూ వచ్చిన రాత్రి ఉష్ణోగ్రతలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. దీంతో రాత్రిళ్లు, వేకువజామున చలి గింతలు పెరిగాయి. శనివారం సత్యసాయి జిల్లా మడకశిరలో 9.1 డిగ్రీలు, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 9.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గడంతో శీతల వాతావరణం నెలకొంది. 27 నుంచి 32 డిగ్రీల మధ్య పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవుతున్నాయి. శనివారం మిగతా ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... అగళి 9.2 డిగ్రీలు, రొద్దం 9.5, తనకల్లు 9.6, సోమందేపల్లి 10.2, అమడగూరు 10.3, నల్లచెరువు 10.4, శెట్టూరు 10.5, వజ్రకరూరు 10.6, కంబదూరు, విడపనకల్లు, పరిగి 10.7, లేపాక్షి 10.8, ఓడీ చెరువు 10.9 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్టం నమోదయ్యాయి.

31న కిసాన్‌మేళా

అనంతపురం అగ్రికల్చర్: బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వద్దనున్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 31న కిసాన్‌మేళా ఏర్పాటు చేసినట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి తెలిపారు. 'సమగ్ర వ్యవసాయం - పోషక ధాన్యాలు, యాంత్రీకరణ' ప్రధాన అంశాలుగా ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కిసాన్‌మేళాలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ తయారు చేస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, జిల్లా మంత్రి ఉషశ్రీచరణ్‌తో పాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లాకు చెందిన వ్యవసాయ అధికారులు పాల్గొంటారని తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కిసాన్‌మేళాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రెండు ఎంపీపీ స్థానాలకు 3న ఎన్నికలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న విడపనకల్లు, చెన్నేకొత్తపల్లి ఎంపీపీ స్థానాలకు ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అధికారులు ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు శనివారం సాయంత్రం ఆదేశించారు. ఇది వరకు జనరల్ మహిళకు ఎంపికైన విడపనకల్లు ఎంపీపీ స్థానానికి వేల్పుమడుగు ఎంపీటీసీ సభ్యురాలు బోయ నాగరత్నమ్మ(బీసీ) ఎన్నికయ్యారు. అయితే ఆమె ఏడాది లోపే ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. బీసీ మహిళకు రిజర్వ్ అయిన చెన్నేకొత్తపల్లి ఎంపీపీగా శ్రీశైలం ప్రవీణ ఎన్నికవగా.. ఆమె ఏడాదిపాటు మాత్రమే పదవిలో కొనసాగారు. తర్వాత ఎంపీపీ పదవికి రాజీనామా చేసి.. నాగసముద్రం ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. దీంతో రెండు ఎంపీపీ స్థానాలకు ఎన్నిక అనివార్యమైంది.

జీఎన్‌ఎం అభ్యర్థులకు రేపటి నుంచి కౌన్సెలింగ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో జీఎన్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 30, 31 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. 30న సైన్స్ గ్రూపులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు, 31న సైన్స్ కంపార్ట్‌మెంట్, ఆర్ట్స్ రెగ్యులర్ అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

విధివంచితులు

- బుద్ధిమాంద్యంతో బిడ్డల ఇక్కట్లు
- ఆలనా పాలనా చూస్తున్న తల్లిదండ్రులు
- అపన్నహస్తం కోసం ఎదురుచూపులు
- తాడిపత్రిలోనే 150 మంది బుద్ధిమాంద్యులు

వారిదో వింతలోకం.. ఉలుకూ పలుకూ లేని వారు కొందరైతే.. నిస్తేజంగా కనిపించేవారు మరికొందరు.. ఆకలేసినా అన్నం అడగలేనివారు ఇంకొందరు.. వయసు పెరుగుతున్నా అందుకు తగ్గట్టు బుద్ధి పెరగడం లేదు. ఎదుగూ బొదుగూ లేని బుద్ధిమాంద్యం పిల్లలను తల్లిదండ్రులు మాత్రం కంటికి రెప్పలా చూసుకుంటూ ఉన్నారు. పిల్లల భవిష్యత్తును తలచుకుంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు.

తాడిపత్రి టౌన్: తాడిపత్రి పట్టణంలో దాదాపు 150 మంది బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నారు. వీరిలో చెవిటి, మూగ, అంధులు, శారీరక, మానసిక వైకల్యం కల్గిన చిన్నారులు దుర్భర జీవితం గడుపుతున్నారు. విధివంచితులైన వారిని తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతూనే ప్రేమతో చూసుకుంటున్నారు.

తల్లిచాటు బిడ్డ ఫక్రుద్దీన్

శ్రీనివాసపురానికి చెందిన లారీ డ్రైవర్ వలిబాషా, బీబీ దంపతులు. వీరి కుమారుడు బాబా ఫక్రుద్దీన్ (29)కు రెండు, కాళ్లు, చేతులు పని చేయవు. మానసిక స్థితి సరిగా లేదు. దీంతో ఆలనా పాలన తల్లి బీబీ చూసుకుంటోంది. వయసు పెరిగినప్పటికీ ఫక్రుద్దీన్ చిన్న పిల్లవాడిగానే ప్రవర్తిస్తుంటాడు.



తమ్ముడికి అక్క అండ



నందలపాడుకు చెందిన అంకాలమ్మ, గంగయ్య దంపతులకు నలుగురు పిల్లలు. వీరిలో లోకేష్ (24) బుద్ధిమాంద్యంతో పుట్టారు. కొన్ని సంవత్సరాల క్రితం లోకేష్ తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి లోకేష్‌ను అక్క జ్యోతినే సంరక్షిస్తోంది. చివరకు తాను వివాహం కూడా చేసుకోలేదు. తమ్ముడికి వచ్చే పింఛన్ డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. లోకేష్ స్వయంగా నడవలేడు. ఎవరైనా పట్టుకుని నడిపించాల్సిందే.



అవ్వ సంరక్షణలో అక్కా తమ్ముడు

వడ్లపాలెంకు చెందిన కూలీలు హజీరాని, దస్తగిరి దంపతులు. వీరికి నస్రున్ (14), మహమ్మద్ సందానీ (15) సంతానం. వీరు పుట్టుకతోనే బుద్ధిమాంద్యులు. రెక్కాడితే గానీ డొక్కాడని దయనీయ జీవితం. ఈ నేపథ్యంలో పిల్లల సంరక్షణ బాధ్యతను అవ్వ దస్తగిరమ్మ తీసుకుంది. దస్తగిరమ్మ అద్దె ఇంట్లో ఇద్దరు పిల్లలతో కలసి ఉంటోంది. నస్రున్, మహమ్మద్ సందానీలకు మతిస్థి మితం లేదు. అన్నం కూడా తినలేని పరిస్థితి. ఆమె ఇంటి వద్దనే చిరువ్యాపారం చేసుకుంటూ.. వచ్చే పింఛన్ డబ్బుతో బతుకు బండి లాగుతోంది.



బుద్ధిమాంద్యుడైన నరసింహులును నడిపిస్తున్న తండ్రి

దీనస్థితిలో ఎందరో..

శ్రీనివాసపురానికి చెందిన హుస్సేన్‌బీ, దస్తగిరి దంపతుల కుమార్తె నూర్జహాన్ (14). నూర్జహాన్ కదలని బొమ్మగా ఉంటుంది. చంటి పిల్లను చూసుకున్నట్టుగా ఆమెను తల్లి చూసుకుంటోంది. పుట్లూరు రోడ్డులోని ఆర్టీటీ కాలనీకి చెందిన ప్రవీణ, రాము భార్యభర్తలు. వీరి కుమారుడు నరసింహులు (13) బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నాడు. వీల్‌చైర్‌కే పరిమితం. గన్నెవారిపల్లి కాలనీకి చెందిన ఆంజనేయులు (18) బుద్ధిమాంద్యం బారినపడ్డాడు. తండ్రి చనిపోవడంతో తల్లి అచ్చమ్మే ఆంజనేయులుకు అన్ని సపర్యలూ చేస్తోంది.

బాగా చూసుకుంటున్నాం



తాడిపత్రి మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో బుద్ధిమాంద్య పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం భవిత సాధన కేంద్రం ఏర్పాటు చేసింది. ఇక్కడ బుద్ధిమాంద్యం పిల్లల కోసం ట్రైసైకిల్, మరికొన్ని ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. వివిధ రకాల బొమ్మలతో పిల్లలు గడిపే విధంగా చూస్తున్నాం. రోజూ 10 నుంచి 20 మంది పిల్లలు భవిత కేంద్రానికి వస్తారు. ఫిజియోథెరపీ వంటి సేవలు కూడా అందిస్తున్నాం. దివ్యాంగుల సర్టిఫికెట్లు ఇప్పించేందుకు సదరం కేంద్రాలకు పంపుతున్నాం.

– నాగరాజు, భవిత కేంద్ర అధికారి, ఎంఈఓ, తాడిపత్రి

పిల్లలను చూస్తే బాధేస్తోంది



నాకు ఇద్దరు పిల్లలు. కొడుకు సృజన్ (7), కూతురు ధరణి (14) బుద్ధిమాంద్యంతో పుట్టారు. పిల్లలను చూస్తే బాధేస్తోంది. దేవుడా ఎందుకు ఇలాంటి పరిస్థితి కల్పించావని ఏడవని రోజంటూ లేదు. పిల్లలు తమ పనులు తాము చేసుకోలేరు. ఒంటరిగా వదిలేస్తే రోడ్లపైకి వెళ్లిపోతారు. వారిని చూసుకోవడానికి నా భార్య లలితమ్మ ఇంటి వద్దే ఉండాల్సి వస్తోంది. ఆటో ద్వారా వచ్చే సంపాదనకు తోడు పిల్లలకు వచ్చే పింఛన్ సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. పిల్లలకు మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేదు. ప్రభుత్వం సాయం చేయాలని కోరుకుంటున్నాం.

– శివశంకర్, తాడిపత్రి

ఎస్టీ పునరుద్ధరణతోనే అభివృద్ధి





మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్‌కుమార్, చిత్రంలో ఎంపీ రంగయ్య, హాజరైన బోయ, వాల్మీకి, ఎస్టీ సంఘాల నాయకులు, కులస్తులు

- ఏకసభ్య కమిషన్‌కు బోయ, వాల్మీకి నాయకుల వినతి

అనంతపురం అర్బన్: ఎస్టీలుగా పునరుద్ధరిస్తేనే బోయ, వాల్మీకి కులాలు ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధిస్తాయని ఆయా కులాల నాయకులు పేర్కొన్నారు. ఎస్టీ జాబితాలో బోయ, వాల్మీకులను చేర్చే అంశంపై అధ్యయనం చేసేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ శనివారం అనంతపురం వచ్చింది. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఎంపీ తలారి రంగయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అన్నాదొరై, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారితో కలిసి ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలు, వినతులను ఏక సభ్య కమిషన్ స్వీకరించింది. వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కులప్ప, అంకే రామాంజనేయులు, సిద్ధప్ప తదితరులు కమిషన్ ఎదుట తమ అభిప్రాయాలను వెల్లడించారు. 1936లో బోయ, వాల్మీకులను ఎస్సీలుగాను, 1968లో ఎస్టీలుగాను గుర్తించారన్నారు. 1970లో డీ-నోటిఫైడ్ ట్రైబ్‌గా పేర్కొంటూ బీసీల్లో చేర్చాన్నారు. ఎస్టీ పునరుద్ధరణ ద్వారానే బోయ, వాల్మీకులకు న్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఎస్టీ రిజర్వేషన్ ఆరు శాతం ఉందని, దీన్ని పెంచకుండా బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఎస్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎస్టీ సంఘాల నాయకులు గుజ్జల లక్ష్మన్న, శివశంకర్, సాకే చిరంజీవి, తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ శాతం పెంచి ఆ కులాలను ఎస్టీలో చేరిస్తే అభ్యంతరం లేదన్నారు. కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఆయా కులాల అభిప్రాయాలు, అర్జీలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.



ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోయ, వాల్మీకి సంఘాల నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల జేఏసీ నాయకులు

దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు

బోయ, వాల్మీకులు అత్యధికులు కడుపేదరికంతో దుర్భర జీవితాలు గడుపుతున్నారు. మాకు ప్రత్యేకంగా ఒక వృత్తి అంటూ లేదు. ఎస్టీ పునరుద్ధరణ ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధిస్తాము. ప్రస్తుతం ఎస్టీలకు అన్యాయం జరగకుండా రిజర్వేషన్ పెంచి మమ్మల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి.

– బోయ రామాంజనేయులు, రాప్తాడు

జీవన ప్రమాణాలు మెరుగవ్వాలి

బోయ, వాల్మీకుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఎస్టీలుగా పునరుద్ధరించడం ద్వారానే అవుతుంది. క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తే బోయల దుర్భర జీవితాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే ఎస్టీ జాబితాల్లో చేర్చడమే ఏకైక మార్గం.

– బోయ సుశీలమ్మ, ఉరవకొండ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్

అన్యాయానికి గురవుతాం

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే ప్రస్తుతం ఎస్టీల్లో ఉన్న వర్గాలకు అన్యాయం జరుగుతుంది. రాష్ట్రంలో బోయ, వాల్మీకి జనాభా 50 లక్షల వరకు ఉంది. ఆ కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే ప్రస్తుతమున్న కులాల వారికి అవకాశాలు తగ్గి అన్యాయానికి గురవుతారు. రిజర్వేషన్ పెంచి చేరిస్తే మంచిది.

– కావేటి ఉమామహేశ్వరి, ఎరుకల సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు

రిజర్వేషన్ పెంచి.. చేర్చండి

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే గిరిజనులు మరింత వెనుకబాటుకు గురవుతారు. మేము ఆ కులాలకు వ్యతిరేకం కాదు. ఎస్టీ రిజర్వేషన్ శాతం పెంచి ఆ కులాలను చేరిస్తే మాకు అభ్యంతరం ఉండదు.

– మల్లికార్జున నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

సూర్యాయనమః



అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సూర్య నమస్కారాలు చేస్తున్న దృశ్యం

రథ సప్తమి వేడుకలు జిల్లా అంతటా ఘనంగా జరిగాయి. పాఠశాలలు, కళాశాలలు, మైదానాల్లో యోగాసనాలతో పాటు సూర్య నమస్కారాలు చేశారు. యోగా, సూర్య నమస్కారాల ఆవశ్యకత గురించి గురువులు చక్కగా వివరించారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం.

వైభవంగా రథసప్తమి





సూర్యప్రభ వాహనంపై భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహుడు, కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఉరవకొండ: పెన్నహోబిలంలో శనివారం రథసప్తమి వేడుకలు ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి సూర్యప్రభ వాహనం, గరుడ వాహనం, హనమద్ వాహనం, గోవాహన ఉత్సవాలు నిర్వహించారు. కల్యాణ మండప వేదికపై అభిజిత్ లగ్నంలో భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. వేడుకల్లో ఆలయ మాజీ చైర్మన్ అశోక్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ గుర్రం సుధాకర్ పాల్గొన్నారు.

పప్పుశనగ కొనుగోలుకు చర్యలు తీసుకోండి

- వ్యవసాయ సలహాదారుడు తిరుపాలురెడ్డి సూచన



జేసీ కేతన్‌గార్గ్‌తో మాట్లాడుతున్న తిరుపాలురెడ్డి

అనంతపురం అర్బన్/బుక్క రాయసముద్రం: పప్పుశనగ పంట ఫిబ్రవరిలోనే కొనుగోలు చేయాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని, ఈ మేరకు చర్యలు చేపట్టాలని జేసీ కేతన్‌గార్గ్‌కు రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాలురెడ్డి కోరారు. అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖరరెడ్డితో కలసి శనివారం జేసీని క్యాంపు కార్యాలయంలో తిరుపాలురెడ్డి కలసి మాట్లాడారు. మార్కెట్ యార్డులో చీనీ కాయలు వేలం పద్ధతిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శనివారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన పరిశీలించి, వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు.

సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్

- నగరానికి దీటుగా రాజీవ్‌కాలనీ పంచాయతీ అభివృద్ధి
- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



రాజీవ్ కాలనీ బ్రిడ్జి ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి (చిత్రంలో) ఎంపీ రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



స్థానికులతో కలసి బ్రిడ్జిని పరిశీలిస్తున్న నాయకులు

అనంతపురం రూరల్: అన్ని వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ధ్యేయమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలన యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీ తలారి రంగయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. నగరం నుంచి రాజీవ్‌కాలనీకి వెళ్లే మార్గంలో వంకపై నిర్మించిన బ్రిడ్జి (జగనన్న వారధిని)ని శనివారం వారు ప్రారంభించి, మాట్లాడారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నామని మండి పడ్డారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ రాష్ట్రంలో అన్నింటా దోపిడీ సాగిందన్నారు. 2014 ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం, 2024లో అధికారంలోకి వలంటీర్, సచివాలయ వ్యవస్థను రద్దు చేసి జన్మభూమి కమిటీలను మళ్లీ ఏర్పాటు చేస్తామని చెప్పే ధైర్యం టీడీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ పేదల ఆకలి తీర్చేందుకు కిలో రూ.2తో బియ్యాన్ని అందిస్తే దానిని చంద్రబాబు తన హయాంలో రూ.5.25 చేసి దోపిడీకి తెరలేపారన్నారు. అధికారంలో ఉండగా టీడీపీ ఏనాడూ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

నగరానికి దీటుగా రాజీవ్‌కాలనీ

అనంతపురం నగరానికి దీటుగా రాజీవ్‌కాలనీ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజీవ్‌కాలనీ పంచాయతీని దత్తతకు తీసుకున్నట్లు ప్రజలను టీడీపీ నాయకులు నమ్మించి, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని గుర్తు చేశారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాతనే పంచాయతీ అభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపుతూ రూ.6కోట్లతో బ్రిడ్జిని నిర్మించినట్లు పేర్కొన్నారు. రూ.16 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ పరిధిలో జీవనం సాగిస్తున్న వారికి ఇంటి పట్టాలు మంజూరు చేశామన్నారు. రాబోవు రోజుల్లో పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గిరిజమ్మ, సర్పంచ్ ఆశాబీ, ఎంపీపీ వరలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరడ్డి, జెడ్పీటీసీ చంద్రకుమార్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, హుస్సేన్, రహీం, కరీం, పసలూరి ఓబులేసు, అంజి, మల్లెల వేణుగోపాల్, పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు

- 5న తిరునాల, రథోత్సవం





దేవరకొండపై కొండమీద రాయుని ఆలయం (ఇన్‌సెట్‌లో) కొండపై స్వామి మూల విరాట్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని దేవరకొండపై ఆదివారం నుంచి కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. లక్ష్మీ నారాయణస్వామి దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను సాయంత్రం కొండపైకి తీసుకెళ్తారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు దేవరకొండపై ఉత్సవ విగ్రహాలకు పుణ్యావచనం, అంకురార్పణ, దేవతా హోమాలు, ధ్వజారోహణం, గరుడ ఆహ్వాన పూజ నిర్వహిస్తారు. అదే రోజున రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారికి పుష్ప పల్లకీ సేవ నిర్వహించనున్నారు. 31న రాత్రి 8 గంటలకు స్వామి వారిని సింహ వాహనంపై పుర వీధుల్లో ఊరేగిస్తారు. ఫిబ్రవరి ఒకటో తేదీ రాత్రి ఎనిమిది గంటలకు స్వామి శేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. రెండో తేదీ రాత్రి హనుమద్‌వాహనంపై విహరిస్తారు. మూడో తేదీ రాత్రి గరుడ వాహనంపై ఊరేగుతారు. నాల్గో తేదీ రాత్రి గజ వాహనంపై ఊరేగిస్తారు. ఐదో తేదీ వేకువజామున నాలుగు గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 11.30 గంటలకు సూర్య ప్రభ వాహనంపై గరుడాద్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణస్వామి దేవాలయం నుంచి పుర వీధుల్లో ఊరేగించనున్నారు. మధ్యాహ్నం బుక్కరాయసముద్రంలో బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తారు. ఆరో తేదీన రాత్రి అశ్వవాహనంపై ఊరేగిస్తారు. ఏడో తేదీ ఉదయం ఏడు గంటలకు తీర్థవాది వసంతోత్సవం నిర్వహించి, అదే రోజు రాత్రి ఏడు గంటలకు స్వామి వారిని హంస వాహనంపై ఊరేగిస్తారు.

హత్యా రాజకీయాలు జేసీ సోదరులకే చెల్లు

- మతిభ్రమించి మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
- తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి.



లక్ష్ముంపల్లి బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: తనపై, తన కుటుంబంపై కారు కూతలు కూస్తే నాలుక కోస్తానని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డిని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హెచ్చరించారు. ప్రజాసంక్షేమ పాదయాత్రలో భాగంగా శనివారం ఆయన లక్ష్ముంపల్లిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అంతకు ముందు తప్పుడు సమాచారంతో ముద్రించిన కరపత్రాలను ఆయన పరిశీలించారు. జేసీ సోదరుల పనేనని నిర్ధారించుకున్న ఆయన బహిరంగ సభలో మాట్లాడుతూ.. తీవ్రంగా స్పందించారు. కరపత్రాలు వేయడం నీచమైన చర్య అన్నారు. మూడు దశాబ్దాల పాటు తాడిపత్రి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఉండి వారు ప్రజలకు చేసిన మేలు, ఈ మూడేళ్లలో తాను చేసిన మేలు, అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానన్నారు. దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. జగన్ సర్కార్‌లో ఫ్యాక్షన్ పూర్తిగా కనుమరుగైందన్నారు. ఇలాంటి తరుణంలో గ్రామాల్లో కక్షలు రాజేసి లబ్ధి పొందాలనుకుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ఇంటి ముంగిటకే ప్రభుత్వాన్ని తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని జేసీ సోదరులు సాగించిన దౌర్జన్యాలు, హత్యలను వివరించారు. వాళ్ల తండ్రి పేరున ఉన్న ప్రాజెక్టును పూర్తి చేసుకోలేని అసమర్థులు జేసీ సోదరులని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 9 నెలలల్లోనే జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకాన్ని పూర్తి చేయించామన్నారు. మంచి, చెడు ఆలోచించే శక్తి ప్రజల్లో ఉందని, ప్రజలకు మంచి చేసే వారికే ఓటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నన్నెవరూ బెదిరించలేదు



రాప్తాడు రూరల్: భూతగాదా విషయంలో తనను రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖరరెడ్డి (చందు) బెదిరించారంటూ చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని అనంతపురం మండలం తాటిచెర్లకు చెందిన గంగిరెడ్డి సూర్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం అనంతపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడలి తరఫున చందు తమకు బంధువవుతారన్నారు. ఈ క్రమంలో తనకు ఆరోగ్యం సరిగా లేదనే విషయం తెలుసుకుని వచ్చి పరామర్శించి వెళ్లారన్నారు. అయితే పచ్చమీడియాలో చందు తనను బెదిరించారంటూ కథనాలు రాయడం బాధాకరమన్నారు. తప్పుడు కథనాలు రాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రేపు కుష్టు నివారణ దినోత్సవం

అనంతపురం సప్తగిరి సర్కిల్: మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 30న యాంటీ లెప్రసీ డేని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ తెలిపారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కుష్టు నివారణ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకూ స్పర్శ కుష్టు వ్యాధి నిర్ధారణకు జిల్లా వ్యాప్తంగా 44 పీహెచ్‌సీల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్(ఎస్టీ మహిళ), టీబీ హెల్త్ విజిటర్ (మహిళ వీహెచ్, ఓసీ జనరల్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదలైంది. ఈ మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు httpr://ananthapuramu.ap.gov.inను పరిశీలించాలన్నారు.

రాయలసీమకు న్యాయం చేయండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలసీమలో రాజధానిని కాని, హైకోర్టును కాని ఏర్పాటు చేసి, ఈ ప్రాంత వాసులకు న్యాయం చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. మూడు రాజధానుల ఏర్పాటు అంశంపై ఎస్కేయూలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమ ప్రాంతానికి రాజధాని, హైకోర్టు కేటాయించాల్సి ఉందన్నారు. 1953లో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంగా ఉన్నప్పుడు కర్నూలు రాజధానిగా ఉండేదని, 1956లో హైదరాబాద్‌ను రాజధానిగా చేసి రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రాయలసీమ ప్రాంతం అన్నింటా వెనుకబాటుకు గురవుతూ వస్తోందన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 'హెల్ప్‌డెస్క్'

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో అనుమానాల నివృత్తి, ఇతర సమస్యల పరిష్కారానికి అనంతపురంలోని కోర్టు ఆవరణంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఉమాపతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో నూతన ఓటర్ల నమోదు, నమోదైన ఓటరు వివరాలను పరిశీలించుకునే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారు ఈ డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మిరెడ్డి, వెంకట్రాముడు, సీపీ గౌడ్, నరసింహారెడ్డి, గోవిందు, ఓబులేసు, సిద్ధు, చింతకాయల నరేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతోనే ఆరోగ్య శ్రేయస్సు

- మంత్రి ఉషశ్రీచరణ్



గర్భిణులను ఆశీర్వదిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలతోనే ఆరోగ్య శ్రేయస్సు సాధ్యమవుతుందని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని పాలవాయిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. 21 మంది గర్భిణులకు సీమంతం చేసి మంత్రి ఆశీర్వదించారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 81,322, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలు 41,238 మంది, 17,594 మంది గర్భిణులు, 16,681మంది బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతుండడంతో ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ లింగమ్మ, సర్పంచ్ నాగరత్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార డెయిరీ వ్యవస్థకు జీవం

- త్వరలో తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ ప్రారంభం
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: గత ప్రభుత్వ హయాంలో జీవచ్ఛవంలా మారిన సహకార డెయిరీ వ్యవస్థకు మళ్లీ జీవం పోసేలా రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి సహకార డెయిరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. అనంతపురం మండలం ఆలమూరు జనగన్న లేఔట్ సమీపంలోని తోపుదుర్తి మహిళా సహకార డెయిరీలో శనివారం సభ్యులతో ఆయన సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల మంది మహిళా పాడి రైతులకు ఉపాధి కల్పించాలనే కల నెరవేరబోతోందన్నారు. ఈ క్రమంలో ఎన్నో విమర్శలు, అవమానాలు ఎదురైనా అక్క, చెల్లెమ్మల కోసం ఎంతో ఆత్మస్థైర్యంతో ముందడుగు వేశానన్నారు. డెయిరీ ఏర్పాటుకు అనువుగా ఉంటుందని రాప్తాడు సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న భూమిని అడిగితే ఎమ్మెల్యే కాజేసుందకంటూ కొందరు మాట్లాడడం బాధకలిగించిందన్నారు. డెయిరీలో సభ్యత్వం కోసం చెల్లించిన డబ్బుతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె కొడుకు శ్రీరామ్ బాధ్యత లేకుండా మాట్లాడుతూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. డెయిరీ ఏర్పాటుకు రూ.17 కోట్ల వరకు ఖర్చైందని, ఎవరెన్ని ఆరోపణలు చేసినా పాడి రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో సహకార డెయిరీలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఇందు కోసం తన కుటుంబసభ్యులంతా ఎంతో బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారన్నారు. డెయిరీ చైర్‌పర్సన్ తోపుదుర్తి నయనతారెడ్డి మాట్లాడుతూ...సహకార డెయిరీ ఏర్పాటు విషయంలో నాలుగేళ్లుగా ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. మహిళలు ఆర్థిక స్వాతంత్రం సాధించాలని సంకల్పంతో డెయిరీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సహకార డెయిరీ ఏర్పాటుతో మహిళా రైతులు లాభాలబాటలో పయనించనున్నారన్నారు. జిల్లాలోనే అతి పెద్ద డెయిరీ ఇదే అవుతుందన్నారు. ఎమ్మెల్యే దూరదృష్టితో ఆలోచించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఉపాధికి డెయిరీ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో ఏపీడీ తులసీరామరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ జనార్దనరెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాలరెడ్డి, మాజీ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బండి పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శభావాలు అలవర్చుకోవాలి

అనంతపురం సిటీ: విద్యార్థి దశ నుంచే పిల్లలు ఆదర్శభావాలు అలవర్చుకోవాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఎస్కేయూలోని భువన విజయ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపైనా ఆసక్తి పెంచుకోవాలన్నారు. విద్యా సంస్థల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎటువంటి చర్యలు ఉంటాయో కూడా స్పష్టం చేశారు. రెక్టార్ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రధానాచార్యులు జీవన్‌కుమార్, బాలసుబ్రహ్మణ్యం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జిలను కలిసిన జిల్లా జడ్జి, ఎస్పీ



హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు, ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం టవర్‌క్లాక్: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిలు ప్రవీణ్‌కుమార్, శ్యామ్‌సుందర్‌ను జిల్లా జడ్జి శ్రీనివాస్, ఎస్పీ ఫక్కీప్ప కాగినెల్లి స్థానిక రోడ్లుభవనాలశాఖ అతిథి గృహంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

మోదీ పాలనలో రక్షణ ఏదీ?

అనంతపురం అర్బన్: నరేంద్రమోదీ పాలనలో మహిళలకు రక్షణ ఏదీ? అని మహిళాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని అన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశానికి దుర్గాభవాని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పద్మావతి, నాయకురాళ్లు రామాంజనమ్మ, జానకి, కుర్షిదా, లక్ష్మీదేవి, మసూద్‌బీ, కమ్మక్క, సారంబీ, యశోదమ్మ, కుళ్లాయమ్మ, శాంతి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మొక్కలతోనే దిగుబడి



మాట్లాడుతున్న సత్యసాయి జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్

రాప్తాడురూరల్: రోగాలు లేని దానిమ్మ మొక్కలు ఎంపిక చేసుకోవాలని సత్యసాయి జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ రైతులకు సూచించారు. శనివారం దానిమ్మ పంటపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లిలో రైతులకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఉద్యాన అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ దానిమ్మలో జీవన ఎరువుల ద్వారానే మొక్కలకు రోగనిరోధక శక్తి కలుగుతుందన్నారు. అనంతపురం జిల్లా జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ రెడ్డి , ఏడీహెచ్ నరసింహారావు ఉద్యాన శాఖలో వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో అనంతపురం హెచ్‌ఓ చందన, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మెంబరు ఆలమూరు సుబ్బారెడ్డి, ఇటుకుల పల్లి సర్పంచ్ భాస్కర రెడ్డి, ఆర్‌బీకే అధికారులు పాల్గొన్నారు.

షేర్ మార్కెట్‌పై నేడు అవగాహన సదస్సు

మదనపల్లె : స్టాక్ మార్కెట్ పెట్టుబడుల అంశంపై ఈనెల 29న అనంతపురం సప్తగిరి సర్కిల్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ ఎదురుగా హోటల్ అలెగ్జాండర్‌లో ఉచిత అవగాహన సదస్సు ఉంటుందని ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వైజర్ మునగల సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు, సాయంత్రం 4 నుంచి 7 గంటలకు నిర్వహించే అవగాహన సదస్సులో షేర్ మార్కెట్ గురించి తెలుసుకుని పెట్టుబడులు ఎలా పెట్టాలి? భవిష్యత్తు అవసరాలకు ఎలా ఇన్వెస్ట్ చేస్తే లాభాలు పొందొచ్చనే అంశాలపై వివరిస్తారని ఆయన చెప్పారు. ఆర్థిక రంగంలో నిపుణుల ద్వారా తెలుసుకుని న్యాయపరంగా ఆదాయాన్ని పెంచుకోవచ్చనే అంశాలపై చర్చిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9966610358లో సంప్రదించాలన్నారు.

పనిముట్లు అందించండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: కార్మికులకు పనిముట్లు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. శనివారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశహాలులో ప్రజారోగ్య విభాగంలోని హెల్త్ ఆఫీసర్, శానిటరీ ఇనిస్పెక్టర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, వార్డు శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి ఈపీఎఫ్, ఈ ఎస్‌ఐ 2010 నుంచి 2023 వరకు అప్లోడ్ చేయించాలన్నారు. కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ప్రజారోగ్యాధికారి గంగాధర్‌రెడ్డి, డీఈ రాంప్రసాద్, శానిటరీ ఇనిస్పెక్టర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

అనంతపురం అర్బన్: వంట గ్యాస్ సిలిండర్ వినియోగించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు ఇండేన్ గ్యాస్ ప్రతినిధులు సూచించారు. ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ దుర్గాశాలిని నేతృత్వంలో అంజనాద్రి గ్యాస్ ఏజెన్సీ, కంపెనీ ప్రతినిధులు కురుగుంట కేజీబీవీలో శనివారం అవగాహన కల్పించారు.

రూ.1.35 లక్షలకు వాహనాల వేలం

రాప్తాడు: ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో రూ.1.35,015కు వేలం వేశారు. సెబ్ సీఐ రవిచంద్ర, ఎస్‌ఐ పీవై ఆంజనేయులు సమక్షంలో శనివారం వేలం వేశారు.

నేడు నగరంలో 2 కే రన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని రాంనగర్‌లో ఆదివారం ఉదయం 7 గంటలకు డీఎస్ త్రైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో 2 కే రన్ నిర్వహిస్తున్నట్లు కోచ్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అనంత చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 2కేరన్ స్థానిక నీరు – ప్రగతి పార్కు నుంచి నలంద డిగ్రీ కళాశాల వరకు సాగుతుందన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా బాలోత్సవం



మాట్లాడుతున్న నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత



నృత్యోత్సవంలో పాల్గొన్న అమ్మాయిలు

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రం వేదికగా సాగుతున్న 'బాలోత్సవం' రెండో రోజు శనివారం ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. వందలాదిగా తరలి వస్తున్న విద్యార్థుల్లో స్ఫూర్తినింపేలా నిర్వహిస్తున్న పోటీలు ఆకట్టుకున్నాయి. ప్రతిభచాటుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేశారు. అవధుల్లేని ఆనందాల పండుగ ఆదివారంతో ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జాలు వారిన ప్రతిభ :
పెద్దలకే పరిమితమైన పౌరాణికం, శాస్త్రీయ దృక్పథం, చరిత్రాత్మకం, వైజ్ఞానిక విషయాలతో కథా గమనాన్ని చిన్నారులు చక్కగా నడిపించారు. వందల ఏళ్ల నుండి భూమిపై వెలసిన విషయాలను పూసగుచ్చినట్టు మెమొరీ టెస్టులో వివరించి మనసు దోచుకున్నారు. శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. వక్తృత్వంలో, ఆలోచనాత్మకంగా వ్యాసరచనలో, దేశభక్తుల మాటలు గుర్తొచ్చేలా ఏకపాత్రాభినయాలతో ఆకట్టుకున్నారు. వ్యర్థాలతో అర్థవంతమైన వస్తువులను సృష్టించి ఔరా అనిపించారు. సినీ, జానపద నృత్యాలతో హోరెత్తించారు. వీనుల విందైన సంగీతంతో మంత్ర ముగ్ధులను చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతులుగా రియాజుద్దీన్, మధురశ్రీ, అంకె శ్రీనివాస్, వన్నూరు మాస్టర్, కుంచె లక్ష్మీనారాయణ, డాక్టర్ నానీల నాగేంద్ర వ్యవహరించారు.

బాలల ఉత్సవం నిర్వహణ అభినందనీయం
చిన్నారుల్లో దాగి ఉన్న సృజనను వెలికి తీసేలా బాలోత్సవాన్ని నిర్వహించడం ప్రశంసనీయమంటూ నిర్వాహకులను రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత అభినందించారు. శనివారం నిర్వహించిన పోటీల్లో విజేతలకు సాయంత్రం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు చిన్నారులకు బాలోత్సవం వేదికైందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పట్నం శివప్రసాద్, ఐద్వా సావిత్రి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, యూటీఎఫ్ నేత జిలాన్‌బాషా, రామన్న, డాక్టర్ సుమన్‌కుమార్, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణం

– ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: దేశంలోనే రాష్ట్ర పోలీసుశాఖ అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖను అగ్రస్థానంలో నిలిపిన సారథులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పోలీసుశాఖపై ప్రజల విశ్వాసం, సమర్థత, నిజాయతీకి సంబంధించిన అంశాలపైన ప్రైవేట్ ఏజెన్సీలతో నిర్వహించిన సర్వే నివేదికను కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన విషయం తెలిసిందేనన్నారు. రాష్ట్ర పోలీసుశాఖ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, రాష్ట్ర పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. ఈ శుభపరిణామం నేపథ్యంలో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



39వ డివిజన్‌లో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రుద్రంపేట పంచాయతీలో సర్పంచ్ పద్మావతి, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, వైస్ ఎంపీపీ బాలాజీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

రుద్రంపేట పంచాయతీ అభివృద్ధికి బాటలు
రుద్రంపేట పంచాయతీలో మూడేళ్లలో రూ.కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులను చేపట్టామని ఎమ్మెల్యే అన్నారు. గతంలో పంచాయతీలో ఏ కాలనీ చూసినా మురికి కూపాలుగా ఉండేవని, నేడు ఏకాలనీలో చూసినా సిమెంట్ రోడ్లు, డ్రైన్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, వలంటీర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రకుమార్, ఎంపీటీసీ మహబూబ్‌బీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాధిక్‌వలి, కృష్ణవేణి, అనిల్ కుమార్‌గౌడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రాజునాయక్, నాయకులు కుళ్లాయప్ప, గోవింద్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, మల్లెల వేణుగోపాల్, అంజీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ అజెండా
అనంతపురం సప్తగిరి సర్కిల్: సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక 39వ డివిజన్‌లో శనివారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నగర మేయర్ వసీం , డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక డివిజన్ కన్వీనర్ చింతకుంట మధుతో కలిసి నిర్వహించారు. అనంతరం ఆయన ప్రజలకు మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిని చేస్తున్నామన్నారు. ప్రజలకు తమపై నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు.

పథకాలు అందించడం బాధ్యతగా భావించాలి: ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకాల ద్వారా పెద్ద ఎత్తున ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. వాటిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు వాటిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. నగర పరిధిలోని బ్రిడ్జిల నిర్మాణానికి రూ.18 కోట్ల నిధులు చెరువు కట్టకు టీడీపీ మళ్లించి, నగరాభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. వారు చేసిన తప్పిదం కారణంగానే నగరంలో నీరు చేరిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింత సోమశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, డైరెక్టర్లు శ్రీదేవి, శ్రీనివాసులు, గోవిందు, గోగుల పుల్లయ్య, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రామయ్య, కృష్ణవేణి, సుజాత, డివిజన్ నాయకులు ఆర్వేటి సురేష్, రఫి, హిదాయతుల్లా, నీలూరు సురేష్, మంజు, పెద్దన్న, నాగార్జున, హరి, జిలాన్, విశ్వనాథ్, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అనంత చొరవతోనే నగరాభివృద్ధి



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరాభివృద్ధిలో అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక ప్రస్థానమని నగర మేయర్ వసీం అన్నారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చిత్రపటాలకు డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంత నగరాభివృద్ధికి రూ. 25 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత చొరవతోనే నగరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. నగరంలో 40 ఏళ్ల నుంచి జరగని అభివృద్ధి ప్రస్తుతం జరుగుతోందన్నారు. ప్రత్యేక నిధులతో సీసీ బ్రిడ్జి, 2 బ్రిడ్జిలు, 2 బీటీ రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ప్రతి సచివాలయం పరిధిలో రూ. 20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అనంత జిల్లా అంటేనే వైఎస్ కుటుంబానికి ప్రత్యేక అభిమానమన్నారు. నగరంలో శాశ్వత ప్రాతిపదికన నీటి సమస్య తీర్చిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు.

లోకేష్‌ది యువ వైఫల్యం యాత్ర: టీడీపీ నేత లోకేష్ చేస్తున్న పాదయాత్ర యువగళం కాదని, యువ వైఫల్యం యాత్ర అని మేయర్ వసీం విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు ఆయన మంత్రిగా రాష్ట్రానికి ఏమి వెలగబెట్టారో ప్రజలకు తెలుసునన్నారు. అనంతపురం నియోజకవర్గంలో 85 సచివాలయాల్లో 1,500 మంది సచివాలయ ఉద్యోగులు, 2,500 మంది వలంటీర్లు ఉన్నారన్నారు. శాశ్వత ప్రాతిపదికన సచివాలయ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. మా ప్రభుత్వంలో సామాజిక న్యాయం జరిగింది కాబట్టే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పదవులు దక్కాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, ఇసాక్, రహంతుల్లా, చంద్రలేఖ, జయలలిత, దుర్గాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, రాధకృష్ణ, రామచంద్ర, సాకే కుళ్లాయిస్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియాతో అప్రమత్తంగా ఉండాలి

రాప్తాడు: ఫైలేరియా వ్యాధితో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. శనివారం ఆయన ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో ఫైలేరియా వ్యాధిపై సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి క్యూలెక్స్ దోమ కాటు వల్ల వస్తుందని, ఇది ఎక్కువగా మురుగు కాలువల్లో నివసిస్తుందన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ నూర్‌బాషా, శేఖర్, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్తలు శివలక్ష్మి, లక్ష్మి, వీరమ్మ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆంధ్ర, బిహార్ జట్ల మ్యాచ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా మైదానంలో బీసీసీఐ ఆధ్వర్యంలో కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నీలో భాగంగా ఆంధ్ర, బిహార్ జట్ల మధ్య ఆదివారం నుంచి క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. శనివారం ఆంధ్ర, బిహార్ జట్లు అనంత క్రీడా మైదానానికి చేరుకున్నాయి. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. క్రీడా మైదానంలో ఆంధ్ర, బిహార్ జట్లతో పాటు టెక్నికల్ అఫీషియల్స్‌తో మ్యాచ్ రెఫరీ శక్తి సింగ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంపైర్లు భరత్‌విజ్, రాజేష్ ఖన్న, స్కోరర్లు తోట విజయ్, చైతన్య, ఏసీఎల్ఓ వెంకటేష్, వీడియో అనలిస్టులు రహిమాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్కేయూ మహిళల క్రికెట్ జట్టు ఎంపిక



ఎస్కేయూ మహిళల క్రికెట్ జట్టు

ఎస్కే యూనివర్సిటీ మహిళల క్రికెట్ జట్టు ఎంపికను స్థానిక ఎస్కేయూ క్యాంపస్‌లో శనివారం నిర్వహించారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు మైసూరు జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీలో నిర్వహించే అంతర్ యూనివర్సిటీలో మహిళల క్రికెట్ టోర్నీలో ఎస్కే యూ జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. క్రీడాకారులను వీసీ మాచి రెడ్డి రామకృష్ణారెడ్డి అభినందించారు. ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసన్, కోచ్ బిందు మాధవి పాల్గొన్నారు.
మహిళల క్రికెట్ జట్టు: హరిత, భావన, మనీష, అఖిల, సాయిలత, షాహీన్, ఫిర్‌దోస్, జాహ్నవి, మైత్రి, సాత్విక, అనూష, శ్రావణి, జయశ్రీ.

పరిశోధనలతోనే సమాజాభివృద్ధి

అనంతపురం సప్తగిరి సర్కిల్: పరిశోధనలతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని అనంతపురంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి అన్నారు. పరిశోధనా పద్ధతులపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేలా అవగాహన సదస్సును శనివారం ఆ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి చక్రధరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన ఆవిష్కరణలకు సమాయత్తం కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రంగనాథ్, జయకృష్ణ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పాత మస్టర్ పద్ధతినే కొనసాగించాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: కార్మికులకు ఫేషియల్ యాప్ అటెండెన్స్ రద్దు చేసి, పాత మస్టర్ పద్ధతిలోనే అటెండెన్స్ వేయాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి కోరారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం

- గీతాలాపన పోటీల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏఎస్పీ హనుమంతు, బోయ గిరిజమ్మ తదితరులు

అనంతపురం కల్చరల్: యువతలో నైతిక విలువలు, దేశభక్తిని నింపడం ద్వారానే మెరుగైన సమాజాన్ని నిర్మించగలమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ అన్నారు. శనివారం సంస్కార భారతి ఆధ్వర్యంలో దేశభక్తిగీతాల పోటీలు జరిగాయి. వందల సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి దేశభక్తి గీతాలాపన చేసి, మెప్పించారు. దేశభక్తి ఉట్టిపడేలా 8 బృందాలకు చెందిన విద్యార్థులు భరతమాతను కీర్తిస్తూ మధురంగా గేయాలాపన చేశారు. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కళాప్రాంగణంలో సంస్కారభారతి కార్యదర్శి లక్ష్మి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి బోయగిరిజమ్మతో పాటు అడిషనల్ ఎస్పీ హనుమంతు, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, సీనియర్ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, విజయ్‌సాయి, బుల్లితెర నటుడు రమేష్‌నీల్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలమ్మ, ఆచార్య సుధాకరబాబు తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు.

చదువుతో పాటు కళల్లోనూ రాణించాలి
అనంతపురం సిటీ: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చదువుతో పాటు సంప్రదాయ కళలకూ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సంస్కార భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేశ భక్తి పాటల పోటీలను డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్యతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఓం నమో భాస్కరాయనమః



మాట్లాడుతున్న వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి

అనంతపురం కల్చరల్: ఓం నమో సూర్యాయనమః ..అంటూ నగరవాసులు సూర్య భగవానుడికి సూర్యనమస్కారాలు చేశారు. శనివారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో 6 గంటల నుంచే వివేకానంద యోగా కేంద్ర ఆధ్వర్యంలో సామూహిక సూర్యనమస్కార యజ్ఞం జరిగింది. యోగా సాధకులు సూర్యభగవానుని స్తుతిస్తూ 108 సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. వివేకానంద యోగ కేంద్ర జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, ప్రిన్సిపాల్ దివాకరరెడ్డి తదితరులు హాజరై, మాట్లాడారు. యోగా శిక్షకులు మారుతీ ప్రసాద్, సుధాకరమూర్తి, దివాకర్, మల్లికార్జున, రమణ యోగాభ్యాసం ప్రాముఖ్యతను వివరించారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత
ఆరోగ్యాన్ని మించిన ఐశ్వర్యం ఉండదని, యోగాతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని టీటీడీ ధర్మప్రచార పరిషత్ నిర్వాహకులు బాబు, పండిట్ వేణు, వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో మొదటిరోడ్డులోని శారదా పాఠశాలలో 250 మందితో సామూహిక సూర్య నమస్కారాలను చేయించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ నిర్వాహకులు బాబు, పండిట్ వేణు, వరప్రసాద్ తదితరులు వందలాది మంది విద్యార్థినులతో యోగా విన్యాసాలను చేయిస్తూ సూర్య భగవానుడిని ఆరాధించారు. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సామూహిక సూర్యనమస్కార యోగా కార్యక్రమం జరిగింది. ఆర్ఎస్ఎస్ విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్‌జీ, డాక్టర్ శ్రీధర్, ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు హిమకర్, సెక్రటరీ పుట్లూరు సుదర్శనరెడ్డి ఆత్మీయ అతిథులుగా యోగా ప్రాధాన్యతపై మాట్లాడారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్: మాఘసప్తమిని పురస్కరించుకొని నగరోత్సవాలు, కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యారాధన, అభిషేకాలు చేసి, సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణేశ్వరి ఆలయంలో ఆది దంపతుల పరిణయ వేడుకలు జరిపించారు. ఆలయ ధర్మకర్త మఠం బసవరాజ స్వామి నేతృత్వంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం జరిపించారు.

యువత అన్ని విధాలా రాణించాలి

అనంతపురం కల్చరల్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని యువత అన్ని విధాలుగా రాణించాలని ఎన్‌వైకే జిల్లా సమన్వయకర్త సందీప్‌కుమార్ అన్నారు. శనివారం నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల యువతతో 'యూత్ పార్లమెంట్ ఫెస్టివల్' వర్చువల్ విధానంలో జరిగింది. ఎన్‌వైకే కార్యాలయంలో సందీప్‌కుమార్, డీడీవో శ్రీనివాసులు మాట్లాడారు. డీడీవో శ్రీనివాసులు మాట్లాడారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన యూత్ పార్లమెంటులో అనంత యువత సమర్థవంతంగా ప్రతిభ చాటినట్లు తెలిపారు. ఈసారి కూడా రాష్ట్రస్థాయికి అనంత నుండి ఇద్దరు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత బీసాటి భరత్, జీఎల్ఎన్ ప్రసాద్ , డాక్టర్ ప్రణతి, యోగా గురువు మహేష్, నాగశోభ తదితరులు న్యాయనిర్ణేతలుగా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాప్తాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు మంజూరు చేసిన జగనన్న ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పీట్ల రామాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి గంగలకుంట జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
అనంతపురం శ్రీకంఠంసర్కిల్: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక శారద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వివిధ అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సీఐ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఉన్నత లక్ష్యాలు, మంచి అలవాట్లు జీవితాలను మలుపుతిప్పుతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత జీవితాన్ని గడపాలని మాత్రమే కోరుకుంటారన్నారు. దిశ యాప్ , ఈవ్ టీజింగ్, డయల్ – 100, రహదారి భద్రత, అనంత ఈగల్ ఐ యాప్, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, సోషల్ మీడియా – సైబర్ నేరాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. పోలీసులతో పాటు శారద మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయండి
ఆత్మకూరు: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కొండన్న లబ్ధిదారులకు సూచించారు. శనివారం వేపచెర్ల దిగువ తండా పంచాయతీలో ప్రభుత్వ ఇంటి నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ ఇళ్లు మంజూరయిన వారు ఇంటి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇటుకలు, ఇసుక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అందుబాటులో ఉంచుతున్నారన్నారు. ప్రస్తుతం పంచాయతీలో 27 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జమీల్ బాషా, ఈవోఆర్డీ కొండన్న, సర్పంచ్ కాంతమ్మ , కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.